



మెదక్ చర్చిలో ఘనంగా ఈస్టర్

ప్రపంచ ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉదయం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్, ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులతో కలిసి మత గురువులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. దైవ సందేశాన్ని వినిపించారు. ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత గురువులు రిచర్డ్ జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

-మెదక్, కల్చర్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)







జ్యోతి ప్రజ్వలన చేసి భూ భారతి అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సదస్సులో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి

భూ భారతిపై రైతు అవగాహన సదస్సులో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిట్టన 'భూ భారతి చట్టం 2025'పై అదివారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరయ్యారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ఉన్న రైతువేదికలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని వివరించారు. భూ భారతి చట్టం రైతులకు వరంగా మారబోతున్నదని పేర్కొన్నారు. ఈ సదస్సులో సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్ నాయక్,నాయకులు చేర్యాల అంజనేయులు, మునిపల్లి సత్యనారాయణ, రఘుగౌడ్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, బుచ్చిరాములు, మహేష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో గడువు తీరిన ట్యాబ్లెట్లు

- జ్వరం, దగ్గుతో వెళ్లిన మహిళకు ఇచ్చిన ఫార్మసిస్ట్
- నిర్లక్ష్యంగా విధులు, ప్రాణాలతో చెలగాటం
- సంగారెడ్డి వెల్‌నెస్ సెంటర్‌లో ఘటన 7



మహిళకు అందజేసిన రెండు నెలల క్రితం గడువు తీరిన మాత్ర

తొలి రోజే ఆరుగురి డీబార్


- డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధుల నుంచి తొలగింపు
- ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు 7



సంగారెడ్డిలోని ఓ పరీక్షా కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



స్వరాష్ట్ర ఉద్యమానికి జైకొడుతూ తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించిన నాటి టీఆర్ఎస్.. ఇప్పటి బీఆర్ఎస్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా పురిటిగడ్డ. 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఆలోచనతో సిద్దిపేటలో పురుడుపోసుకున్న గులాబీ పార్టీ పాతికేళ్ల సంబరానికి సమయం ఆసన్నమైంది. రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించి మెతుకుసీమ సత్తా చాటాలని ఆ పార్టీ శ్రేణులంతా పది రోజులుగా శ్రమిస్తున్నాయి.



గులాబీ జాతరకు సమాయత్తం

రజతోత్సవ వేడుకపై బీఆర్ఎస్ శ్రేణుల దృష్టి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనసమీకరణపై ఫోకస్
- సన్నాహక సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బిజీ
- సమీక్షలతో కసరత్తు చేస్తున్న హరీశ్‌రావు
- సిద్దిపేట నుంచి ఎల్కతుర్తికి భారీ పాదయాత్ర
- పార్టీ, స్వరాష్ట్ర ఉద్యమానికి మెతుకుసీమనే పురిటిగడ్డ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 20 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకపై ఆ పార్టీ శ్రేణులు దృష్టిసారించారు. మొన్న అసెంబ్లీ, నిన్న పార్లమెంటు ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత జరుగుతున్న తొలి సభ ఇది. అంతేగాకుండా పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భం. పార్టీకి పురిటిగడ్డగా ఉన్న మెతుకుసీమలో రెండు దశాబ్దాల పాటు తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించిన గులాబి దండుకు గడిచిన ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. మరికొద్ది రోజుల్లోనే స్థానిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న తరుణంలో ఈ వేడుకను అందిపుచ్చుకోవాలని, పునర్వైభవానికి బాటలు వేసుకోవాలని బీఆర్ఎస్ నేతలంతా సన్నద్ధమవుతున్నారు.

జనసమీకరణకు కసరత్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి లక్ష మందిని తరలించాలని బీఆర్ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు. కానీ ఎండలు మండుతుండడంతో ఆ సంఖ్య సాధ్యమవుతుందా.. లేదా అని తర్జనభర్జన పడుతున్నారు. ఇక సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోనే భాగమైన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ప్రస్తుతం సభ జరుగుతోంది. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే 50వేల జనాభాను సమీకరించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 30వేల మందిని తరలించేలా హరీశ్‌రావు వాహనాలను సమకూర్చుకున్నారు. ఇక గజ్వేల్, నర్సాపూర్, మెదక్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, దుబ్బాక నియోజకవర్గాల నుంచీ 10వేల చొప్పున

మిగతా 7వ పేజీలో

సమీక్షిస్తున్న హరీశ్‌రావు

రజతోత్సవ సభ కోసం మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో సమావేశమైన అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో నిత్యం సమీక్షిస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల సమావేశాల్లో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పటాన్‌చెరులో ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర అనంతరం జరిగిన సమావేశంలోనూ జనసమీకరణ గురించి హరీశ్ కార్యకర్తలతో చర్చించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. వాహనాలు, భోజన ఏర్పాట్లు, ఇతరాత్ర విభాగాలకు ప్రత్యేక కమిటీలను నియమించారు. ఈ కమిటీలకే బాధ్యతలు అప్పగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

'ధరణి'కి ప్రత్యామ్నాయంగా భూ భారతి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 'ధరణి' వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఆదివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు భూభారతి చట్టంపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఎం సందేశం రైతులకు వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభిస్తున్నదన్నారు. నూతన చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. రైతులు తమ సమస్యలను హెల్ప్‌డెస్క్‌లో అందజేయవచ్చని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ భూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురాగా ఆర్డీవో మహిపాల్‌రెడ్డి సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గఫర్, డీఈవో రాధాకిషన్, వ్యవసాయ శాఖ అధికారి పుణ్యవతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైటెన్షన్

- సోషల్‌మీడియాలో ర్యాలీపై ఓ యువకుడి అనుచిత వ్యాఖ్యలు
- అతడి ఇంటివద్ద ధర్నా చేసేందుకు హిందూవాహిని కార్యకర్తల యత్నం 7
- అడ్డుకున్న పోలీసులు
- పట్టణంలో పికెటింగ్ ఏర్పాటు

పింఛన్ అక్రమాలకు చెక్

ఫేస్ రికగ్నిషన్ అమలుకు కసరత్తు

మెదక్ జిల్లాలో 1,16,227 మంది ఫింఛన్‌దారులు



మెదక్ అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కార్ చేయుత పథకం కింద అందజేస్తున్న పింఛన్ల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టే దిశగా దృష్టిసారించింది. లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయడంతోపాటు పంపిణీలో పారదర్శకత తీసుకురావాలని సెర్ప్ నిర్ణయించింది. అందు కోసం ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నైజేషన్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కరసత్తు చేస్తోంది. త్వరలో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది.

అక్రమాలకు చెక్ పెట్టేలా..

మున్సిపాలిటీల్లో పింఛన్ సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఇలాంటి వారు బతికి ఉన్నారో.. లేరోననే సమాచారం అధికారులకు తెలియడం లేదు. ఎవరైనా పింఛన్ లబ్ధిదారు మృతిచెందితే కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చినట్లయితే సదరు లబ్ధిదారుడికి అందించే పింఛన్ నిలిచిపోతుంది. కానీ అలా జరగడం లేదు. పింఛన్‌దారు మరణించినా డబ్బులు మాత్రం వారి ఖాతాల్లో జమవుతున్నాయి. వాటిని కొంతమంది ఏటీఎంల ద్వారా డ్రా చేసుకుంటున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు పలుచోట్ల చోటు చేసుకున్నాయి. ఇదిలా ఉంటే పింఛన్‌దారుల్లో అత్యధికులు వృద్ధులు, దివ్యాంగులే. వీరి వేళ్ల కొసలు అరిగిపోయి వేలిముద్రలు పడకపోవడంతో పంపిణీలో సమస్యలు తలెత్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రల ఆధారంగా పింఛన్ అందజేస్తున్నారు. అందుకు పదేపదే తిరగాల్సి వస్తోంది. దీనికితోడు కొంత మంది పంచాయతీ కార్యదర్శులు సైతం మరణించిన లబ్ధిదారుల పింఛన్ కాజేసిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేదిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. పింఛన్ సొమ్ము పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీలుగా ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను తీసుకొచ్చేలా కసరత్తు చేస్తుంది.

జిల్లాలో పరిస్థితి

మెదక్ జిల్లాలో వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, గీతా, బీడీ వర్కర్లతోపాటు హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు, ఫైలేరియా బాధితులు, డయాలిసిస్ రోగులకు ప్రభుత్వం ప్రతి నెల చేయుత పథకం కింద పింఛన్ అందిస్తుంది. జిల్లావ్యాప్తంగా అన్ని కేటరిగీలు కలిపి 1,16,227 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో దివ్యాంగులకు రూ.4,016, ఇతరులకు రూ.2,016 అందజేస్తోంది.

లబ్ధిదారుల వివరాలు

వితంతువులు	: 46,251
వృద్ధులు	: 39,934
బీడీ కార్మికులు	: 15,826
దివ్యాంగులు	: 8,622
ఒంటరి మహిళలు	: 4,271
గీత కార్మికులు	: 928
చేనేత కార్మికులు	: 495



లేగదూడ కళేబరాన్ని చూపుతున్న రైతులు

సంజీవన్‌రావుపేటలో చిరుత కలకలం

- దూడను హతమార్చిన చిరుత
- పాదముద్రలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట శివారులో చిరుత సంచారం కలకలం సృష్టించింది. చిరుత ఓ లేగదూడను హతమార్చింది. బాధిత రైతు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన నారాయణ రోజులాగే శనివారం రాత్రి గ్రామ శివారులోని చేను వద్ద పశువులను కట్టేసి ఇంటికివచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా కట్టేసిన లేగదూడను అడవి జంతువు చంపినట్లు గుర్తించాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు పరిసరాల్లో చిరుత పాదముద్రలను గుర్తించారు. దీంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఖేడ్ అటవీశాఖ రేంజీ అధికారిణి అనురాధ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను చేల వద్ద కట్టేయవద్దని సూచించారు.

కడుపు కోత

సిజేరియన్లకే ప్రైవేటు ఆస్పత్రుల మొగ్గు

- సంగారెడ్డి జిల్లాలో 60 శాతం సీ-సెక్షన్లు
- మొక్కుబడిగా కాన్పులపై ఆడిట్
- కాసుల కక్కుర్తిలో వైద్యాధికారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం



సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని అటు ప్రభుత్వం, ఇటు వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తున్నా ఆచరణలో మాత్రం నెరవేడం లేదు. సంగారెడ్డి జిల్లాలో కాసులకు కక్కుర్తిపడి చాలా ప్రైవేటు ఆస్పత్రులు సీజేరియన్ కాన్పులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటులో చేరగానే ఏ మాత్రం సమయం తీసుకోకుండా సాధారణ కాన్పులపై ధ్యాస పెట్టకుండా హై రిస్కు కేసు అంటూ సీ-సెక్షన్‌లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కో కాన్పుకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక సందర్భాల్లో తల్లి, బిడ్డల క్షేమం కోసం మాత్రమే సీజేరియన్ ప్రసవాలు చేయాలన్న నిబంధనలున్నా చాలావరకు శస్త్రచికిత్సలకే మొగ్గుచూపడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.

సంగారెడ్డి జిల్లాలో ఏడాదిలో ప్రసవాల వివరాలు

సాధారణ ప్రసవాలు	సీజేరియన్	ప్రసవాలు
ప్రభుత్వ ఆస్పత్రులు	10,241	6,972
ప్రైవేటు ఆస్పత్రులు	757	3,905

మొక్కుబడిగా సీ-సెక్షన్ ఆడిట్

సీజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరిగే ప్రైవేటు ఆస్పత్రుల్లో సీ-సెక్షన్ ఆడిట్ నిర్వహించాలి. ఆడిట్‌లో సీ-సెక్షన్ ఎందుకు చేయాల్సి వచ్చిందనే కారణాలు వివరించాలి. అకారణంగా సీజేరియన్ చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ జిల్లాలో చాలా ఆస్పత్రుల్లో 60 శాతంపైగా సీజేరియన్ ప్రసవాలే ఎక్కువ జరుగుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో సుమారు 200 వరకు ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ప్రైవేటులో సీ-సెక్షన్ కాన్పులపై కాసులకు అలవాటుపడి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీ-సెక్షన్ ఆడిట్ మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



(ఫైల్)

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే సిజేరియనే..

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏడాది కాలంలో జరిగిన సీజేరియన్ ప్రసవాలు పరిశీలిస్తే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. గడిచిన ఏడాదిలో సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో మొత్తం 3,905 ప్రసవాలు జరిగితే అందులో 757 మాత్రమే సాధారణ ప్రసవాలు కాగా, మిగిలినవి సీ-సెక్షన్ కాన్పులు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిత్యం ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీలు చేస్తూ ప్రసవాల వివరాలు పరిశీలించి సిజేరియన్లపై తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు శస్త్రచికిత్సలకే ప్రాధాన్యమిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లా యంత్రాంగం కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి.

మంత్రి ఆదేశాలతో మార్పు వచ్చేనా?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, అకారణంగా సిజేరియన్ ప్రసవాలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఈ నెల 17న నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అంతే కాకుండా ప్రైవేటులో సిజేరియన్ ప్రసవాలు కట్టడి చేయాలని, ఇందుకు సీ-సెక్షన్ ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కూడా మంత్రి సూచించారు. మంత్రి ఆదేశాలతోనైనా అధికారులు స్పందించి సిజేరియన్ల నియంత్రణకు చర్యలు చేపడతారేమో చూడాలి.













రాజస్థాన్ కూలీలకు తప్పిన భారీ ప్రమాదం

● బ్రిడ్జి సైడ్‌వాల్ ఢీకొని ఊడిన ప్రైవేటు బస్సు చక్రాలు ● హల్దీవాగు బ్రిడ్జి అంచుపై నిలిచిన ట్రావెల్స్ బస్సు

తూప్రాన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు కూలీలను తరలిస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు భారీ ప్రమాదం తప్పింది. బ్రిడ్జి సైడ్‌వాల్‌కు ఢీకొట్టగా రెప్పపాటులో ప్రమాదం నిలిచిపోయింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు ఊపిరి బిగబట్టి బయటపడ్డారు. అందులో ప్రయాణిస్తున్న 20 మంది కూలీలు ప్రాణాలతో బయటపడగా, స్వల్పగాయాలకు గురయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన కూలీలు హైదరాబాద్‌లో పనులు చేసేందుకు వస్తుంటారు. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు (ఎంపీ 13జెడ్‌జీ 8454)లో 20 మంది కూలీలు హైదరాబాద్‌కు బయలుదేరారు. తూప్రాన్ పట్టణ శివారులో 44వ జాతీయ రహదారి హల్దీ వాగు బ్రిడ్జిపైకి రాగానే సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది.





హల్దీవాగు బ్రిడ్జి సైడ్‌వాల్‌పై నిలిచిన బస్సు, క్రేన్ సహాయంతో ఊడిన చక్రాలు తీస్తున్న దృశ్యం


సుమారు 20 అడుగుల మేర బ్రిడ్జి సైడ్‌వాల్ దెబ్బతినగా, బస్సు సైడ్‌వాల్ మధ్యలో నిలిచిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న కూలీలకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సు బ్రిడ్జి వైపు ఒరిగినా భారీ ప్రమాదం జరిగేది. ప్రమాదం నుంచి బయటపడిన కూలీలను మరో బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. తూప్రాన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.


'రాజీవ్ యువ వికాసం గడువును పెంచాలి'

నారాయణఖేడ్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల గడువును కనీసం 24 వరకు పెంచాలని సామాజిక కార్యకర్త మున్వర్ ఖురేషి కోరారు. వరుసగా హనుమాన్ జయంతి, రెండో శనివారం, ఆదివారం, అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవులు రావడంతో సర్టిఫికెట్లు రాక అనేకమంది దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. అందువల్ల దరఖాస్తుల గడువును పొడిగించాలని కోరారు.









బైక్ ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



దశరథ(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవులపల్లి గ్రామ శివారులో హత్నూర-దౌల్తాబాద్ రోడ్డుపై శనివారం రాత్రి జరిగింది. మాదుర గ్రామానికి చెందిన లింగన్నగారి దశరథ రోజు మాదిరిగానే శనివారం ఉదయం దౌల్తాబాద్ వచ్చి రాత్రి స్వగ్రామానికి తన బైక్‌పై వెళ్తున్నాడు. దేవులపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే హత్నూర వైపు నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ తలకు తీవ్రగాయాలు కాగా, అతని బైక్‌పై ఉన్న మహిళ, ఎదురుగా వచ్చిన బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా ముగ్గురిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ దశరథను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వీరమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పిలికొట్టాల శివారులోని పిల్లికుంట(చిన్న చెరువు)లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) కుంటలో మృతిచెంది ఉన్నాడని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిసరాలను పరిశీలించారు. మృతుడి శరీరంపై కుడిచేతి మట్టపై త్రిశూలం ట్యాటూ ఉంది. మెడలో పూసల గొలుసు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసులకు 8712657913 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పశువుల అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు



పశువులను తరలిస్తున్న వ్యాన్

కొండపాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా పశువులను తరలిస్తుండగా దుద్దెడకు చెందిన పలువురు అడ్డగించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిద్దిపేట నుంచి కొండపాక వైపు బొలెరోలో తొమ్మిది ఆవులు, ఒక లేగను తరలిస్తున్నారు. దీనిని మురళీ అనే వ్యక్తి గమనించి హిందూవాహిని సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు పోలీసులకు తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు దుద్దెడ టోల్ గేట్ వద్ద వాహనాన్ని అడ్డగించి విచారించారు. నల్లగొండ సంత నుంచి హైదరాబాద్ మూసాపేటకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. అనుమతులు లేకుండా తరలిస్తున్నారని తేలడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిష్ఠాపనోత్సవాలకు రామాలయం ముస్తాబు

● నేటి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు

● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



పెద్దశంకరంపేటలో ముస్తాబైన రామాలయం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ఠోత్సవాలకు మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని రామాలయం సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించనట్లు ఆలయ అధ్యక్షుడు గుజ్జరి స్వప్నకనకరాజు తెలిపారు. 21 ఉదయం వేద స్వస్తి ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, మాత్రు కారాధనము తదితర పూజలు, 22న ఉదయం గురు వందనం, మంటప ఆవాహిక దేవతాపూజలు, జపాలు, ధాన్యాదివాసం, లక్ష పుష్పార్చన, 23న యంత్ర, మూర్తి, ధ్వజ, ప్రాణ ప్రతిష్ఠలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరుకానున్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

జాతరకు ఎల్లమ్మ ఆలయం ముస్తాబు



ఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ ఆలయంలో వెలసిన ఎల్లమ్మతల్లి

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్‌లో వెలసిన ఎల్లమ్మ ఆలయ జాతర ఈ నెల 23 నుంచి ప్రారంభంకానున్నది. ఇందుకు ఆలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఈ జాతరకు సంగారెడ్డి జిల్లా నలుమూలల వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. 23న బోనాల ఊరేగింపు, 24న బండ్ల ప్రదర్శన, 25న పాచి బండ్ల ప్రదర్శన, నిండు జాతర, 26న కుస్తీ పోటీలు, 27న చివరి పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ర్యాకల ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని భక్తుడు చారి సొంత ఖర్చులతో 35 బండ్లను ఆలయం చుట్టూ తిప్పనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అఖండ హరినామ సప్తాహ

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్య కాలనీలో గల శివ పంచాయతన అభయాంజనేయ స్వామి ఆలయంలో 21 నుంచి 28 వరకు అఖండ హరినామ సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వామన్‌రావుమహరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కోశాధికారి సాయిబాబు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలు

● లేబర్‌కోడ్ అమలుతో కార్మికుల హక్కులకు విఘాతం
● సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

పటాన్‌చెరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాల రూపకల్పనకు తెరవెనక ప్రయత్నాలు చేస్తోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. తోషిబా పరిశ్రమల సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్మిక హక్కులు, లేబర్‌కోడ్‌లపై పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లేబర్‌కోడ్‌లను అమలుతో 99శాతం పరిశ్రమలకు కార్మిక చట్టాలు వర్తించవన్నారు. లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న చేపడుతున్న జతీయ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. తోషిబా పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ 25ఏళ్లలో తోషిబా కార్మికులు కలిసికట్టుగా సీఐటీయూ నేతృత్వంలో అనేక విజయాలు సాధించామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్, కోశాధికారి రాజయ్య, ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి అనంతరావు, నాయకులు శ్రీధర్, వెంకటేశ్వరావు, పుల్లంరాజు, శ్రీనివాస్‌నాయుడు, నరేందర్, ప్రకాష్, సురేష్, మైపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

● ఎంపీ సురేష్ షెట్కార్



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కంగ్టి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తున్నదని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తడ్కల్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం జొన్నలకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3371 చెల్లిస్తుందన్నారు. జొన్నలు పండించిన రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రంలో అమ్ముకొని లబ్ధి పొందాలని సూచించారు. రైతులతో పాటు కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, ఏవో హరీష్ పవార్, మండల పార్టీ అధ్యక్షులు మల్‌రెడ్డి, పరశురాం, మనోహర్, మాణిక్‌పటేల్, నాగన్న, ఉపేందర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, జ్ఞానేశ్వర్, బ్రహ్మానందారెడ్డి, దావిద్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు భక్తుల తాకిడి



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

పాపన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వన దుర్గ మాత దర్శనం కోసం జనం బారులు తీరారు. భక్తులందరూ ముందుగా మంజీరా నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ పూజారులు హారతి, ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిబ్బంది భక్తులకు సౌకర్యాల కల్పనలో తలమునకలయ్యారు.

తాగునీటి కట కట

కంది మండలంలో నీటి కష్టాలు

● మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు
● పనిచేయని పంచాయతీ బోర్లు
● రెండు నెలలుగా ట్యాంకర్లే దిక్కు
● అరకొర నీటితో తప్పని అవస్థలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు



కొయ్యగుండుతండాలో డ్రమ్ముల్లో ట్యాంకర్ నీరు నింపుతున్న పంచాయతీ సిబ్బంది

కంది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ సరఫరా అయ్యే పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో కంది మండలంలో గత పది రోజులుగా మునుపెన్నడూ విధంగా నీటి కటకట ఏర్పడింది. మండల పరిధిలోని కొయ్యగుండుతాండా, చిమ్నాపూర్, కంది, కలివేముల, తోపుగొండ, మామిడిపల్లి, కవలంపేట, ఎర్దనూర్ తదితర గ్రామాల్లో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నటువంటి కంది మండలంలో గత రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు రావడంతో కాస్త ఊరట చెందారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక జనాలు నానా తంటాలు పడుతున్నారు.

పంచాయతీ ట్యాంకర్ కోసం ఎదురుచూపులు

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు నిత్యం ఇంటి ముందు బిందెలు, బకెట్లు, డ్రమ్ములు పెట్టుకున్న పంచాయతీ ట్యాంకరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు పంచాయతీ బోర్లు కూడా పనిచేయడంతో నీటి సమస్య మరింత ఉధృతమైంది. ఎండా కాలం నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఎన్నిసార్లు మరమ్మతులు చేసిన పంచాయతీ బోర్లు పనిచేయకపోవడంతో ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజల అవసరాలకు ట్యాంకర్ల నీరు సరిపోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ట్యాంకర్‌తో నీటిని సప్లై చేయాలంటే పంచాయతీ అధికారులు వారి జేబుకు చిల్లు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం మిషన్ భగీరథ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామస్థులు కూడా ఈ ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరు ఇంటి అవసరాలకే సరిపోక ఇబ్బందులు పడుతున్నామని, ఇక తమ పశువులు, మేకల, పెంపుడు జంతువుల గతి ఎంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కందిలో పంచాయతీ ట్యాంకర్‌తో నీటిని సరఫరా

వెల్‌నెస్ సెంటర్‌లో గడువు ముగిసిన ట్యాబ్లెట్లు !

● జ్వరం, దగ్గుతో వెళ్లిన మహిళకు ఇచ్చిన ఫార్మసిస్ట్
● సంగారెడ్డి వెల్‌నెస్ సెంటర్‌లో ఘటన

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : మందులు ఇచ్చే ఫార్మసిస్టులు విధుల పట్ల ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా రోగులు ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సిందే. తాజాగా సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో విధుల పట్ల ఫార్మసిస్ట్‌ల నిర్లక్ష్యం బహిర్గతమైంది. జ్వరం, దగ్గు ఇతరత్ర అనారోగ్య లక్షణాలతో ఆదివారం నాడు వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబసభ్యురాలైన ఓ మహిళకు డాక్టర్ ఏడు రకాల మందులు రాశారు. ఓపీ చీటీతో ఫార్మసీకి వెళ్లిన ఆమెకు ఫార్మసిస్ట్ ఏడు మాత్రలు అందజేశారు. తదనంతరం ఆమె ఇంటికి వెళ్లిన తర్వాత ట్యాబ్లెట్లు ఒక్కోటి వేసుకుందామని పరిశీలిస్తుండగా అందులో ఓ ట్యాబ్లెట్(ఓమెప్రజోల్ గ్యాస్ట్రో క్యాప్సల్-20 ఎంజీ) గడువు ఫిబ్రవరి-2025 తోనే ముగిసినట్టు కనిపించింది. దీంతో వెంటనే పసిగట్టి అప్రమత్తమై ట్యాబ్లెట్‌ను వేసుకోకుండా ఆమె పక్కన బెట్టారు. ఈ విషయాన్ని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. గడువు ముగిసి రెండు నెలలు అవుతున్నా ఇంకా ఆ మాత్రలే ఇవ్వడంపై ఆ ఉద్యోగి, కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదరరాజనర్సింహ ఇలాకాలో ఇటు వంటి పరిస్థితి నెలకొనడం బాధాకరమని వారు వాపోయారు. కాగా రెండు నెలల నుంచి ఆ మాత్రలు ఇంకెంత మందికి పంపిణీ చేశారోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉంటే 20 రోజులుగా ఈ వెల్‌నెస్ సెంటర్‌లో రెగ్యులర్ ఎంబీబీఎస్ డాక్టర్లు లేరు. డెంటల్ డాక్టర్ల తోనే ఓపీ మందులు రాసి పంపుతున్నారు. తాజాగా ఫార్మసిస్ట్ గడువు ముగిసిన మందులు ఇవ్వడం సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్‌లో అడుగడుగునా జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు బాధితులు అభిప్రాయపడుతున్నారు.

అర్ధరాత్రి హైటెన్షన్

● సోషల్‌మీడియాలో ర్యాలీపై ఓ యువకుడి అనుచిత వ్యాఖ్యలు
● అతడి ఇంటివద్దకు వెళ్తున్న హిందూవాహిని యువకులను అడ్డుకున్న పోలీసులు
● మిరుదొడ్డిలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు



గ్రామంలో మోహరించిన పోలీసులు

మిరుదొడ్డి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం రాత్రి మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న ర్యాలీ ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. హిందువుల ర్యాలీపై గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు సోషల్‌మీడియాలో హిందువులను రెచ్చగొట్టె వ్యాఖ్యలను చేశాడు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఆ యువకుడి ఇంటి ముందు ధర్నా చేయడానికి వెళ్తున్న హిందూ వాహిని, బీజేపీ నాయకులను మిరుదొడ్డి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, హిందేవాహిని కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసులు మోహరించారు. ప్రధాన వీధుల్లో పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. హిందువులపై అనుచిత వాఖ్యలను చేసిన సదరు యువకుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి చేరుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్ హిందూవాహిని కార్యకర్తలను శాంతింపచేశారు. దీంతో గ్రామంలో ఆందోళనను విరమించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చివరకు హిందువులపై అనుచిత వాఖ్యలను చేసిన యువకుడిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని సీఐ హామినివ్వడంతో గొడవ సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు మల్లేశం, శ్రీనివాస్, దేవరాజు, సహదేవారెడ్డి, కరుణాకర్, స్వామి, అంజిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జాతరకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

తరలించాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు ఆదేశాలు అందాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, దూళిమిట్ట, మద్దూరు మండలాలు సభా ప్రాంతానికి 50 నుండి 70 కిలోమీటర్ల లోపే ఉంటాయి. ఇక్కడి నుంచి కూడా జనాన్ని సమీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లోనూ జనసమీకరణపై దృష్టి సారించారు.

వెయ్యిమందితో పాదయాత్ర

సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు 60 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్ణయించారు. వెయ్యి మందికిపైగానే విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలతో జరగనున్న ఈ పాదయాత్రను ఈనెల 26న హరీశ్ ప్రారంభిస్తారు. మరుసటి రోజు సభాసమయానికి వీరంతా ఎల్కతుర్తికి చేరుకుంటారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే భారీ సభలకు సిద్దిపేటలో వినూత్నంగా కార్యక్రమాలు చేపడతారు. గతంలో సిద్దిపేట నుంచి వరంగల్ సభకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఇందులో కేసీఆర్, హరీశ్‌రావు సైతం ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో జరిగిన సభకు ట్రాక్టర్ల ర్యాలీ, అదే విధంగా ఓసారి ద్విచక్రవాహనాల ర్యాలీతో ఆకర్షించారు. ఈసారి వెయ్యిమందితో భారీ పాదయాత్రను అట్టహాసంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి భోజన, వసతి ఇతర సదుపాయాలను సిద్ధం చేశారు.

పునర్వైభవం కోసం

బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఎదురుగాలి వీచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 10 స్థానాలకు 7 చోట్లా గెలుపొందినప్పటికీ పార్లమెంటులో మాత్రం ఓటమి ఎదురైంది. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో సిట్టింగ్‌లను కోల్పోయింది. అంతేగాకుండా మూడో స్థానానికి పడిపోయింది. ఈ అనూహ్య ఫలితాలతో మెతుకుసీమలోని నగటు గులాబీ కార్యకర్తలంతా తీవ్ర నైరాశ్యంలో మునిగారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చినప్పటికీ పార్టీ నుంచి అభ్యర్థిని నిలపలేదు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌కు గేర్ ఛేంజ్ చేసే అవకాశం దక్కలేదు. ప్రస్తుతం రజతోత్సవ వేడుక తెరమీదకు రావడంతో ఆ పార్టీలో ఉత్సాహం రేకెత్తుతోంది. గ్రామాలు, పట్టణాల్లో గోడ మీద రాతలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నారు. దారి ఖర్చులకు కూలి పనులు చేసి వినూత్నంగా నగదు సంపాదిస్తున్నారు. ఈ సభతోనైనా పూర్వ వైభవం చాటాలని భావిస్తున్నారు.



సంగారెడ్డిలోని జడ్పీహెచ్ఎస్ కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యాసకులు

తొలి రోజే ఆరుగురు డిబార్

● డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధుల నుంచి తొలగింపు
● ప్రారంభమైన 'ఓపెన్' స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పటాన్‌చెరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసి కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు ఇంటర్ విద్యార్థులను డిబార్ చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్ 9 కేంద్రాలు, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ హిందీ, తెలుగు, ఉర్దూ పరీక్షకు 3257 మందికి 3023 మంది హాజరుకాగా, 234 మంది గైర్హాజరయ్యారు. టెన్త్ తెలుగు, తమిళ్, కన్నడ పరీక్షకు 1323 మందికి 1207 మంది హాజరుకాగా, 116 మంది గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ పరీక్షకు 117 మందికి 105 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా టెన్త్ సైకాలజీ, మరాఠి పరీక్షకు ఇద్దరికి ఇద్దరు హాజరయ్యారు. కాగా డీఈవో వెంకటేశ్వర్లు ఆర్‌సీపురం, బీహెచ్ఈఎల్‌లోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

రోహింగ్యాలకు అడ్డాగా సంగారెడ్డి

● విశ్వహిందూపరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం రోహింగ్యాలకు అడ్డాగా మారుతుందని విశ్వహిందూపరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ అన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డిలో హిందువులు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐక్యత లోపం, దౌర్జన్యంగా కూల్చివేసిన రామమందిర నిర్మాణానికి 11 తరాల స్వాభిమానాన్ని హిందువులు కోల్పోయారని తెలిపారు. బెంగాల్‌లో హిందూ మహిళల మాన, ప్రాణాలను తీస్తూ దాడులు చేస్తున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహప్రముఖ్ సుభాష్‌చందర్ మాట్లాడుతూ శాంతినగర్‌లో ఓ ఇంటిని అక్రమంగా మసీదుగా మార్చారని ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అంతకుముందు వీహెచ్‌పీ జిల్లా ధర్మ ప్రసాద్ సమితి కార్యవర్గ ప్రశిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మప్రసార్ ప్రముఖ్ జాదవ్, సంఘటన మంత్రి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పవన్ పాల్గొన్నారు.

వేతన వెతలు

● నాలుగు నెలలుగా అందని వేతనాలు ● పూట గడవక జీపీ కార్మికుల అవస్థలు



వేతనాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అసలే చాలీచాలని వేతనాలు.. ఆపై ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. దిక్కుతోచని స్థితిలో విధులు నిర్వహిస్తూ.. నెలల కొలది కాలం వెళ్లదీస్తున్నారు పంచాయతీ కార్మికులు. హత్నూర మండలంలో 38 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో మొత్తం 160 మంది మల్టీ పర్పస్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారం రోజుల క్రితం మండలంలోని 33 గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు విడుదల చేసింది. మిగతా ఐదు గ్రామపంచాయతీలు గుండ్లమాచునూర్, బోర్పట్ల, గోవింద్రాజ్‌పల్లి, చందాపూర్, తుర్కలఖానాపూర్ గ్రామాలలో పని చేసే సుమారు 30మంది పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేచినప్పటి నుంచి గ్రామాంలోని వీధులను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఇంటికి తాగునీటిని అందించే గ్రామ పంచాయితీ కార్మికులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.9,500 చెల్లిస్తుంది. ఆ డబ్బులతోనే ఇంటి అవసరాలు తీర్చుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రతీ నెల వేతనాలు వస్తాయన్న ఉద్దేశంతో ఇతరాత్ర అవసరాల కొరకు అప్పులు చేసుకున్నారు. 2024 నవంబరు నుంచి వేతనాలు రావడం లేదు. ఇతరాత్ర పనుల రూపకంగా నిధులు సమకూరి ఆర్థికంగా ఉన్న గ్రామ పంచాయితీ కార్యదర్శులు చెక్ రాసి ఎస్‌టీవోలకు పంపినప్పటికీ చెక్కులు డ్రా కావడం లేదు. ఫలితంగా కార్మికులకు నిర్ణీత సమయంలో వేతనాలు రాకపోవడంతో పూట గడువక అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా ఎదురుచూపులు

మండలంలోని గుండ్లమాచూనూర్, బోర్పట్ల చందాపూర్, తుర్కలఖానాపూర్, గోవిందరాజుపల్లి గ్రామ పంచాయతీలలో ఇతరత్రా పన్నుల ద్వారా వచ్చిన కోట్ల రూపాయల నిధులు గ్రామ పంచాయతీల ఖాతాలో ఉన్నా ప్రభుత్వం వాటిని తీయకుండా ఫ్రీజింగ్ పెట్టడంతో నిరుపయోగంగా మారాయి. నిధులు లేని గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లిస్తుండగా, తమపై వివక్ష చూపడం ఏమిటని ఆ ఐదు గ్రామ పంచాయతీల కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధుల విడుదలపై ఫ్రీజింగ్ ఎత్తివేసి బకాయి వేతనాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీతాలు ఇవ్వకుంటే బతికేదెట్లా?

తాము ప్రతీ రోజు గ్రామ పంచాయతీ పరిధిలో పనులు చేస్తున్నప్పటికీ నెలల కొలది వేతనాలు చెల్లించడం లేదు. నాలుగు నెలలుగా వేతనాలు రాక అప్పులు చేసి సంసారాన్ని నెట్టుకొస్తున్నాం.. పూటగడవని పరిస్థితిలో అనేక అవస్థలు పడుతున్నాం. అధికారులు కరుణ చూపి బకాయి వేతనాలు చెల్లించాలి.

\- శంకిరి దుర్గమ్మ, పంచాయతీ కార్మికురాలు, గుండ్లమాచునూర్

మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు

● రాజీవ్‌రహదారి పక్కన నిలువనీడ కరువు ● బస్సులకోసం ఎండలోనే పడిగాపులు

చేర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ సౌకర్యం కల్పించకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. మల్లన్న ఆలయానికి రాజీవ్ రహదారి మీదుగా అయినాపూర్- తిమ్మారెడ్డిపల్లి శివారు, కొండపాక-కొమురవెల్లి శివారు మీదుగా దారి ఉంది. ఎక్కువశాతం కొండపాక స్వాగత తోరణం నుంచి భక్తుల రాకపోకలు సాగుతుంటాయి. సిద్దిపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలుపుతుండటంతో పాటు పక్కనే చిన్నపాటి షెల్టర్, దుకాణాలు ఉండటంతో భక్తులకు కాస్త నీడ లభిస్తుంది. కానీ సిద్దిపేట వైపనకు వెళ్లడానికి రోడ్డుకు అవతలి వైపున నిలబడుతున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుతో పాటు వంపు నెలకొని ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. షెల్టర్ నిర్మాణం చేయాలని యేటా బ్రహ్మోత్సవ సమీక్షా సమావేశాల్లో ప్రస్తావించడం, సంబంధిత అధికారులు పరిశీలిస్తామంటున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈవిషయమై ఆర్టీసీ, మల్లన్న ఆలయాధికారులు, పాలకమండలి, ప్రజాప్రతినిధులు చొరవ వహించి మల్లన్న భక్తులకు నిలువనీడ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన ఎండలో బస్సులకోసం ఎదురుచూస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

యువత స్వయం ఉపాధి మార్గంలో రాణించాలి

● సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : యువత స్వయం ఉపాధి మార్గంలో రాణించాలని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వర్తక సంఘం భవనంలో ప్రొప్రైటర్ విక్రమ్ సమక్షంలో ఏర్పాటుచేసిన శ్రీ అయ్యప్ప కమ్యూనికేషన్ డిజిటల్ సేవా సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సదానందరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ: ఎస్ఐ

నర్సాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని ఎస్ఐ లింగం తెలిపారు. ఆదివారం నర్సాపూర్ కాలేజీ మైదానంలో షూటోకాన్ కరాటేలో శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల క్రమశిక్షణతో పాటు మానసికంగా, ఆరోగ్య పరంగా దృఢంగా తయారవుతారన్నారు. ముఖ్యంగా బాలికలు కరాటేలో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ అశోక్, ఎగ్జామినర్ నగేష్, నరసింహ, ప్రసన్న పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

వెల్దుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారు నుంచి ఆదివారం టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి గ్రామ వైకుంఠధామం ముందు ఉన్న వ్యవసాయ పొలంలో పోస్తున్నారు. అనుమతులు లేకుండా టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తరలిస్తుండడంతో గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

చేగుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మహిళ మృతిచెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తలారి కమలమ్మ(60) తన వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుండెపోటు రావడంతో అక్కడిక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

చలువ పందిళ్లు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్చారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : 'బస్సు వచ్చేదాకా ఎండలోనే' అనే కథనం ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆదివారం భక్తులకు ఇబ్బందులకు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఏడుపాయల అమ్మవారి దగ్గరికి వెళ్లే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది సంగమేశ్వర్ అక్కడే ఉండి పనులు ఏర్పాటు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

కొండాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. అలియాబాద్ గ్రామానికి చెందిన సయ్యద్ రైసాద్(36) ఈ నెల 18న అనారోగ్యానికి గురై కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం మధ్యాహ్నం వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తూప్రాన్ దాబాల్లో తనిఖీలు

తూప్రాన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ శివారులోని దాబాల్లో ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డాగ్ సహాయంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులను విమర్శించే హక్కు లేదు

శివ్వంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నాయకులను విమర్శించే హక్కు లేదని పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా అన్నారు. శనివారం శివ్వంపేటలో నవీన్‌గుప్తా గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్లుగా కాలేజీ భవనం నిర్మించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నా పట్టించుకోలేదన్నారు.

వైభవంగా మల్లన్నస్వామి కల్యాణం

మునిపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కల్యాణంలో భక్తులు, నాయకులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ సర్పంచ్ ఎడ్ల శంకర్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.



మూడ్‌తండా- తాండూర్ మధ్య కంకరతేలిన రోడ్డు

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

● కంకర తేలిన రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటం ● నరకం అనుభవిస్తున్న ప్రజలు

జహీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు కొరవడి ప్రమాదకరంగా మారాయి. ప్రత్యామ్నాయం లేక పాడైన రోడ్ల మీదుగా వెళ్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి పాడైన రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో గుంతలమయంగా మారాయి. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. అలాగే బూర్దిపాడ్, బూచనెల్లి, తూంకుంట, శేఖాపూర్, ఆనెగుంట, జాడిమల్కాపూర్, రాయిపల్లి, శేఖాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉన్నది.

పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నాం

పనులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మిగిలిన పనులకు మళ్లీ టెండర్లను పిలిచి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. జహీరాబాద్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో బ్రిడ్జీలు మంజూరయాయి. వాటి పనులు త్వరలో చేపడతాం.

- రాంచందర్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్

ముందుకురాని కాంట్రాక్టర్లు

జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు వెళ్లే 45 రోడ్ల మరమ్మతు పనులకు 100 కిలోమీటర్ల పైచిలుకు రోడ్లను బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.70 కోట్లను మంజూరు చేసింది. అందులో ఎంఆర్ఆర్ కింద రూ.7.14 కోట్లు, ప్రత్యేకాభివృద్ధి నిధుల కింద (ఎస్‌డీఎఫ్) రూ.51.88 కోట్లు, ఫ్లడ్ డ్యామేజీ కింద రూ.12 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ అధికారులు వివరించారు. అలాగే ఎంఆర్ఆర్ కింద 9 పనులకు రూ.7.14 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద 26 పనులకు రూ..51.88 కోట్లు, ఫ్లడ్ డ్యామేజీ కింద 7 పనులకుగాను రూ.10 కోట్ల చొప్పు నిధులు మంజూరయ్యాయి. ఇందులో మొగుడంపల్లిలో 6.11 కిలోమీటర్లకు రూ1.90 కోట్లు, న్యాల్‌కల్ మండలంలో 5 కిలోమీటర్ల (రూ.1.95 కోట్లు) పనులకు మూడుసార్లు టెండర్లను పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదని అధికారులు చెప్పారు. మిగతా పనులకు ఇటీవలే కొందరు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నా- పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదన్నారు.



పూర్తిగా ధ్వంసమైన యశ్వంతరావుపేట రోడ్డు

అధ్వానంగా యశ్వంతరావుపేట రోడ్డు

వెల్దుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేట రోడ్డు అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం నుంచి యశ్వంతరావుపేటకు చేరుకునేందుకు రెండు దారులు ఉన్నాయి. ఆరెగూడెం, కుకునూర్, ఎం.జలాల్‌పూర్ మీదుగా యశ్వంతరావుపేటకు 14 కిలోమీటర్ల దూరం ఉన్నది. దూరభారం తగ్గించేందుకు గతంలో ఎలుకపల్లి మీదుగా 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఎలుకపల్లి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. రోజు ద్విచక్ర వాహనాలు, ఆటోలతో పాటు భారీ వాహనాలు ఈ రోడ్డుపై వెళ్లడంతో బీటీరోడ్డుపై తారు లేచిపోయి గుంతలమయంగా మారింది. దీంతో కొందరు కుకునూర్ మీదుగా చుట్టూ తిరిగి ఆయా గ్రామాలకు వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టెండర్లు పిలిచినా రావడం లేదు

గత ప్రభుత్వంలో వెల్దుర్తి నుంచి ఎలుకపల్లి, యశ్వంతరావు మీదుగా మంగళపర్తి వరకు బీటీ రోడ్డు మరమ్మకు రూ.75 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు పదిసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురావడం లేదు. ఎవరైనా ముందుకొచ్చి టెండర్ తీసుకుంటే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం.

- పవన్, పీఆర్ఏఈఈ

భగవంతుని సేవలో తరించాలి: హరీశ్‌రావు

సదాశివపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : భగవంతుని సేవలో తరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సదాశివపేట పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం సుహాసిని పూజ నిర్వహించారు. ఈ పూజకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేసి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సామూహికంగా నిర్వహించే వ్రతాలు, పూజల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని భగవంతుని సేవలో తరించాలన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దిడిగే నాగేశ్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కోదూరు అంజయ్య, అధ్యక్షుడు మాశెట్టి ప్రకాశం, ఆలయ సంఘం అధ్యక్షుడు అనుముల సాయిరాజ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేటలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హరీశ్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

నమ్లీమేట్‌లో దుర్గాభవానీ విగ్రహ ప్రతిష్ఠాపన

● హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నమ్లీమేట్‌లో ఆదివారం దుర్గాభవానీ మాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు వారిని శాలువాలతో సన్మానించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఖేడ్ మున్సిపాలిటీలో వాటర్ సప్లయ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జన్వాడ బస్వరాజ్ మూడురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం స్వగ్రామమైన సిర్గాపూర్ మండలం చిన్నముబారక్‌పూర్ గ్రామానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఖాజాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గయాబాయి, మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటకు చెందిన మాజీ సర్పంచ్ నర్సింలు మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు యాదవరెడ్డి, అశోక్‌పాటిల్, పండరిరెడ్డి, మాణిక్‌గౌడ్, రాంరెడ్డి, రాజన్న, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులను సన్మానిస్తున్న నమ్లీమేట్ గ్రామ పెద్దలు

విద్యారంగ అభివృద్ధిలో ఎంఈవో సేవలు అభినందనీయం

● ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేష్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ అభివృద్ధిలో ఎంఈవో నీలకంఠం చేసిన సేవలు అభిందనీయమని రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ గాజర్ల రమేష్ కొనియాడారు. ఆదివారం ఓ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ఎంఈవో ఉద్యోగ విరమణ అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించి ఎంఈవోగా ఎనలేని సేవలందించారన్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల డీఈవోలు రాధాకిషన్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎంఈవో దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటర్ సుదర్శన్‌మూర్తి, డీఎస్వో రాజిరెడ్డి, సిద్ధార్థ్ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌చౌదరి, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనపై దృష్టి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బహుళ అంతస్తుల నివాసాల సముదాయాల్లో సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్ కాలనీ స్నేహ రెసిడెన్సీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించిన సమస్యలు పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగయ్య, మోహన్‌రెడ్డి, బాలమనోహర్, సంజీవ్‌నాయర్, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు


మెదక్ అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షలకు 379 మందికి గానూ.. 341 మంది హాజరు కాగా..38 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 827 మందికి గానూ 761 హాజరు కాగా.. 66 మంది అభ్యాసకులు గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష జరిగింది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 12 కేంద్రాల్లో 2,535 మందికి 2,255 మంది హాజరుకాగా 280 మంది గైర్హాజరయ్యారు. 88.95 హాజరు శాతం నమోదైందని బీసీ గురుకులాల ఆర్‌సీవో గౌతంకుమార్‌రెడ్డి కోరారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 17న కేసీఆర్‌పై ఎమ్మెల్యే రోహిత్‌రావు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యేనే ఈ విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజమసని ప్రశ్నించారు. అలాంటి వ్యక్తిపై కేసులు పెట్టాల్సిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ నేతలు మల్లికార్జున్‌గౌడ్, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, గడ్డమీది కృష్ణాగౌడ్, జుబేర్, రాజు, సోహెల్, గౌస్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

నర్సాపూర్/పెద్దశంకరంపేట/హత్నూర/కోహీర్/రామాయంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో ఆదివారం సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 40 రోజుల పాటు ఉపాస ప్రార్థనలు చేసి గుడ్‌ఫ్రైడే నాడు క్రీస్తు మరణించి తిరిగి మూడో రోజు ఆదివారం ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. ఆరాధన అనంతరం శిలువ చుట్టూ ప్రదర్శనలు చేస్తూ పాటలు పాడుతూ కొవ్వొత్తులు వెలిగించారు. ఈ ఆరాధనలో చర్చి బైటర్ ఇంచార్జి రెవ సందీప్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాస్టర్ ఎయిట్ ఇన్‌చార్జి గురువులు దేవవరం, సెక్రెటరీ చార్లేస్ వాకర్ పాల్గొన్నారు. హత్నూర మండల పరిధిలోని కాసాల, కొన్యాల, రెడ్డిఖానాపూర్, రెడ్డిపాలెం, హత్నూర, దౌల్తాబాద్ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. కాసాల గురువులు రెవరెండ్ కాంతారావు, కొన్యాల గురువులు రెవరెండ్ అమృతయ్య వాక్యోపదేశం చేశారు. మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, కవేలి, గురుజువాడ, రాజనెల్లి, మద్రి, పీచేర్యాగడి, సజ్జాపూర్, బడంపేట, పర్శపల్లి, గొడిగర్‌పల్లి, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, చింతలఘట్టు గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. రామాయంపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ పండుగ జరుపుకున్నారు.



కోహీర్ మండలం బిలాల్‌పూర్‌లో ఈస్టర్ గుట్ట వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రామిరెడ్డి, నవీన్‌గుప్తా

శివ్వంపేట/రామాయంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాల చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లలో విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొంతాన్‌పల్లి, ఉసిరికపల్లి, పెద్దగొట్టిముక్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు బల్వంత్‌రెడ్డి, వీరేశం, కృష్ణారావు, హనుమంత్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు. రామాయంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రజనీకుమారి, సొసైటీ చైర్మన్ బాదే చంద్రం, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు ప్రారంభించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



బోర్ వేసేందుకు పూజలు చేసిన గిరిధర్‌రెడ్డి, తదితరులు

జహీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సొంత నిధులతో బోర్లు వేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫల పరిశోధనా కేంద్రం సందర్శన



కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు

జిన్నారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధనా కేంద్రాన్ని జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. పలు పండ్ల రకాల మొక్కలు, పండ్ల మొక్కల సాగు, పరిశోధన అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు శాస్త్రవేత్తలు పండ్ల మొక్కలసాగు, వాటి ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీరు లేక ఎండుతున్న మొక్కలు

మాసాయిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలంలోని స్టేషన్ మాసాయిపేట, రామంతపూర్ తదితర గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారి వెంట నాటిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని పలువురు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కన ఎండిపోతున్న మొక్క

విద్యుదాఘాతంతో పశుగ్రాసం దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శివ్వంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ట్రాక్టర్‌లో తీసుకొస్తున్న పశుగ్రాసం దగ్ధమైంది. శివ్వంపేట మండల పరిధిలోని పోతులబోగూడ శివారులో ఆదివారం అధిక లోడుతో ట్రాక్టర్‌లో పశుగ్రాసం తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులో 11 కేవీ విద్యుత్ వైర్ తగిలి పూర్తిగా దగ్ధమైంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చేరకుని మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది.

'దళితులపై దాడి అమానుషం'

చేగుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దళితులపై దాడులు అమానుషమని దళిత సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్ అన్నారు. చేగుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో నిర్మించిన శిలాఫలకం విషయంలో దళిత సంఘం జిల్లా నాయకుడు బత్తుల చంద్రంపై దాడిచేయడం అమానుషమని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల నాయకులు నరేష్, ఎగ్గడి బాబు, ఎగ్గడి వెంకటి, మొయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



పోలీసులు సీజ్‌చేసిన టిప్పర్

మునిపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజేష్‌నాయక్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను టిప్పర్‌లో తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మునిపల్లి పోలీసులు మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ టిప్పర్‌పై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని గుర్తించి, సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇస్మాయిల్‌ఖాన్ పేట నుంచి తీసుకొచ్చిన ఇసుకను బీదర్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు టిప్పర్ డ్రైవర్ అబ్దుల్ ముబీన్, టిప్పర్ యజమాని మహ్మద్ సాబేర్ చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. టిప్పర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.